క్లుప్తంగా

తాచు పాము కలకలం



తాచుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ ప్రకాశరావు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలోని ఉచ్చులవారిపేటలో గురువారం ఆరు అడుగుల గోధుమ రంగు తాచుపాము కలకలం సృష్టించింది. రైతు చింతపల్లి రాంబాబు ఇంటి వద్ద ఎండుగడ్డి మోపుల మాటున దాగిఉన్న తాచుపామును గమనించిన స్థానికులు కలవరపడ్డారు. వెంటనే అదే గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ యాళ్ల ప్రకాశరావుకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఆయన గడ్డి మోపుల్లో దాగిన తాచుపామును చాకచక్యంగా చేతితో బయటకు తీశారు. దానికి నీరు తాగించారు. అనంతరం ఆ పామును సంచిలో బంధించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి విడిచిపెట్టారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామికి మహా శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివారికి మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యులు ఆధ్వర్యంలో తిరుమల యాత్రకు అవకాశం లేని భక్తులకు దీక్షా విరమణ చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ పడాల పెదవేంకటరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండరామ వార్షికోత్సవం

అంబాజీపేట: మాచవరం శివారు చప్పిడివారిపాలెంలో ఉన్న కోదండరామ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి కలశారాధన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

రూ.13.68 లక్షలకు రేవు వేలం పాట ఖరారు

మామిడికుదురు: కరవాక–ఓడలరేవు వేలం పాట రూ.13.68 లక్షలకు ఖరారైంది. కరవాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం రేవు వేలం పాట నిర్వహించారు. జాయింట్ కమిటీ చైర్మన్ రేకాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకూ రేవు నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో హెచ్చు ధరకు రేకాడి నాగరాజు దక్కించుకున్నారు. వేలం పాటలో కరవాక ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, ఓడలరేవు సర్పంచ్ మల్లాడి మంగతాయారు, ఎంపీపీ పాలా శ్రీలక్ష్మి, ఈఓ పీఆర్డీలు ఎంవీవీ సత్యనారాయణమూర్తి, అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరావు, రామచంద్రమూర్తి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు. ఎనిమియా నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందిస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందరికీ పంపిణీ చేయడంతో పాటు, ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జనవరి నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్ సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేశారు. పలు సూచనలు, సలహాలను అందజేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్, ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ పాల్గొన్నారు.

శుభాలిచ్చే శుక్రవారం

- నేడు గుడ్ ఫ్రైడే
- క్రైస్తవులకు ఏసుక్రీస్తును శిలువ వేసిన దినం
- ముస్లింలకు పవిత్ర రంజాన్ మూడో శుక్రవారం



కొత్తపేట కమ్మిరెడ్డిపాలెంలోని మసీదు



కొత్తపేటలోని మన్నా చర్చ్

కొత్తపేట: ముస్లింలు, క్రైస్తవులకు ఈ శుక్రవారం శుభాలు కలుగచేసే ఎంతో పవిత్రమైన రోజు. ముస్లింలకు ప్రధాన పండగ రంజాన్. ముస్లింలు ఈ నెల 12 నుంచి రంజాన్ ఉపవాసాలు ప్రారంభించారు. ఈ నెలలో నాలుగు శుక్రవారాలు వారికి ఎంతో పవిత్రమైనవి. అలాగే సర్వ మానవాళి రక్షణకు ఏసుక్రీస్తు శిలువపై కఠిన మరణం పొంది.. తద్వారా ప్రజలను పాప విముక్తులను చేసిన రోజుగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) జరుపుతారు.

ముస్లింలు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు

సాధారణంగా ముస్లింలకు శుక్రవారం పవిత్రమైన రోజు. ఇక రంజాన్ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలను అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. ఆ రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. వారి ప్రార్థనలను ఫలప్రదం చేసేందుకు ముస్లింలు శుక్రవారం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తారు. ఎంత ముఖ్యమైన కార్యక్రమం ఉన్నా, శుక్రవారం నమాజ్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఆ సమయంలో ఇతర కార్యక్రమాలు పెట్టుకోరు. రంజాన్ మాసమంతా దైవారాధనలోను, పేదలకు దానధర్మాలు చేయడంలో నిమగ్నమవుతారు. రంజాన్ మాసంలో, ప్రత్యేకించి శుక్రవారాల్లో చేసే ప్రార్థనలను అల్లాహ్ తప్పక అనుగ్రహిస్తారని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

క్రైస్తవులకు గుడ్ ఫ్రైడే పర్వదినం

ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకొనే పర్వదినాల్లో గుడ్ ఫ్రైడే ముఖ్యమైనది. ఈ శుభ శుక్రవారం నాడు క్రైస్తవులు ఏసుక్రీస్తును ఎంతో పవిత్రంగా స్తుతిస్తారు. క్రీస్తు దేవుడైనప్పటికీ, మానవుడిగా ఈ లోకంలో జన్మించి, మానవులను పాప విముక్తులను చేయడానికి, సర్వ మానవాళి రక్షణ కోసం శిలువపై కఠిన మరణాన్ని పొందారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఆ రోజును శుభ శుక్రవారంగా జరుపుతారు. శిలువ శ్రమల్లో పాలుపంచుకున్న ప్రతిఒక్కరూ ఆయన పునరుజ్జీవంలో భాగాన్ని పంచుకుంటారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను మననం చేసుకుంటారు. క్రైస్తవ ప్రార్థన మందిరాలైన చర్చిల్లో క్రీస్తును కొలుస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పురవీదుల్లో శిలువ యాత్ర చేస్తారు.

ముస్లింలకెంతో పవిత్ర దినం



రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనది. ఈ మాసమంతా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ కఠిన ఉపవాసంతో గడుపుతాం. సాధారణంగా ముస్లింలు శుక్రవారాలను ఎంతో పవిత్రమైనవిగా భావిస్తాం. అందులోనూ రంజాన్ మాసంలో వచ్చే శుక్రవారాలు మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయి. చివరి శుక్రవారమైతే మరీ అత్యంత పవిత్రమైనది. ఈ శుక్రవారాలు ముక్తిని ప్రసాదించే రోజులుగా భావించి, ప్రత్యేక ప్రార్థనలు చేస్తాం. శుక్రవారం ప్రార్థనలను అల్లాహ్ ఎంతో కరుణతో మన్నించి, కోరిన ఫలాన్ని అందిస్తారని మా విశ్వాసం.

– షేక్ ఖాజాబాబు, ప్రెసిడెంట్, కమ్మిరెడ్డిపాలెం మసీదు, షాదీఖానా, కొత్తపేట

పాప విముక్తులను చేసిన రోజు



సర్వమానవాళి పాపాలతో వచ్చే శాపం వల్ల నిత్య నరకానికి గురవుతుండగా, ఆ పాప విమోచన కోసం పరిశుద్ధ రక్తం ఆవశ్యకమని సర్వ వేదాలు ఘోషిస్తున్నాయి. ఆ శాప విమోచన కోసం ఏసుక్రీస్తు ఈ లోకంలో పరిశుద్ధుడిగా జన్మించి, పరిశుద్ధ జీవితం గడిపి, సకల మానవాళి పాప పరిహారార్థం కలువరి శిలువపై అతి ఘోరంగా మానవ శాప శిక్ష భరించి, పరిశుద్ధ రక్తాన్ని చిందించారు. చివరి ఏడు మాటలు పలికి, మరణించిన ఆ రోజును క్రైస్తవ లోకం శుభ శుక్రవారంగా జరుపుకొంటోంది. క్రైస్తవులంతా ఉపవాస దీక్షలతో ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలు ధ్యానించి పర్వదినంగా జరుపుకొంటాం.

– బిషప్ జి.అబిద్నగో, పాస్టర్, ప్రవచన దేవుని సంఘం, యెరూషలేం చర్చి, కొత్తపేట

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

మామిడికుదురు: రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ రెండో తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆరు మండలాల్లో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, కెరీర్ గైడెన్స్‌పై ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల వీరబ్రహ్మం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ తెలిపారు. గురువారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసిన అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు. రెండో తేదీ మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు ఈ శిక్షణ ఇస్తారని చెప్పారు. మామిడికుదురు, మలికిపురం, పి.గన్నవరం, అమలాపురం, కొత్తపేట, ఆలమూరు మండలాల్లో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రాజోలు న్యాయవాద సంఘ కార్యవర్గం

రాజోలు: రాజోలు న్యాయవాద సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. న్యాయవాద సంఘ అధ్యక్షుడిగా మామిడిశెట్టి సాయిబాబు, ఉపాధ్యక్షుడిగా చింతా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గొల్లమందల స్టాలిన్, కోశాధికారిగా వీవీ నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా సిర్రా వెంకటేశ్వరరావు, గుబ్బల రజిత, కార్యవర్గ సభ్యులుగా బి.ప్రేమ్‌కుమార్, గర్నిపూడి సత్యనారాయణ ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది జాలెం భాస్కరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడు కోట సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2023–24 ఏడాదికి సంబంధించిన ఆదాయ, వ్యయ వివరాలను ప్రధాన కార్యదర్శి కొక్కిరగెడ్డ శేషగిరి వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, పీవీ కృష్ణంరాజు, ఆకుల భాస్కరరావు, పొన్నాడ సూర్యారావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, నీతిపూడి సత్యనారాయణ, ఉపాధ్యాయుల లక్ష్మీనారాయణ, సత్తిరాజు వెంకటేశ్వరరావు, స్వామి తదితరులు అభినందనలు తెలిపారు.

ఆశీలు వసూలుకు వేలం

అంబాజీపేట: మాచవరం పంచాయతీకి సంబంధించి రోజువారీ సంత, జంతు వధశాల, వారపు పశువులు, కూరగాయల సంతలకు గురువారం ఆశీలు వసూలు చేసుకునేందుకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు వేలం నిర్వహించారు. రోజువారి సంత రూ.3.72 లక్షలు, జంతు వధశాల రూ.35 వేలు, వారపు కూరగాయల సంత రూ.89,200, వేలంలో పాటదారులు దక్కించుకున్నారు. అయితే పశువుల సంత వేలాన్ని అధికారులు వాయిదా వేశారు.

బండారు వ్యాఖ్యలు అర్థరహితం



చింతలూరులో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: మండలంలోని చింతలూరు పర్యటనకు వచ్చిన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తన హోదాను మరిచి, చిల్లర ఆరోపణలు చేయడం ఆయన బాధ్యతారాహిత్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారుల సౌకర్యార్థం స్థలాల్లోకి వాహనాలు వెళ్లేందుకు వీలుగా తన సొంత నిధులతో గ్రావెల్‌ను నింపడం కూడా తప్పు అన్నట్టుగా చిత్రీకరించడం తగదన్నారు. ఇసుక మాఫియా టీడీపీ హయాంలోనే జరిగిందనే విషయాన్ని మరువరాదన్నారు. దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తుంటే, ఓర్వలేని కొందరి చెప్పుడు మాటలు విని, తమను విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే బండారుకు కానీ, ఆ పార్టీ నాయకులకు కానీ లేదన్నారు. అలాగే గ్రామంలో మహిళను అవమానించామని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ నియమావళిని మాత్రమే గుర్తు చేశామన్నారు. మహిళలను గౌరవించే సంస్కృతి వైఎస్సార్ సీపీకి ఉందన్నారు. వైఎస్సార్ సీపీకి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని వారు దుయ్యబట్టారు. సర్పంచ్ మార్గని కరుణ, ఉప సర్పంచ్ మోరంపూడి వాసు, పలివెల దుర్గయ్య, అత్తిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమైక్యంగా ముందుకు సాగుదాం



మట్టపర్రులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు



దిండిలో పార్టీలో చేరిన వారితో గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ సమైక్యంగా ముందుకు సాగి, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం మట్టపర్రు గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వంగా నిరూపించారని చెప్పారు. చేసినది ప్రజలకు చెప్పి, ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఉందన్నారు. ప్రతి కార్యకర్త కూడా ఎన్నికల వేళ కష్ట పడి పని చేసి పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు ఏం చెప్పి ఓట్ల అడగగలవని ప్రశ్నించారు. గతంలో చేసిన అవినీతిని చెప్పి టీడీపీ ఓట్లు అడగాలని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు, సొసైటీ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, బంద్రెడ్డి శ్రీనివాస్, సాగి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

మలికిపురం: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం దిండిలో ఆయన ఆధ్వర్యంలో 20 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి గొల్లపల్లి పార్టీ కండువాలను వేసి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీపీఐకు చెందిన దేవ రాజుబాబుతో పాటు, టీడీపీకి చెందిన చింతా రామకృష్ణ, చింతా భూపతి, పెద్దిరెడ్డి కుమార్ రాజు, బత్తుల రవి, ఏసుగుపల్లి నరసింహమూర్తి ఉన్నారు. వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలు, సీఎం వైఎస్ జగన్ పాలన నచ్చి చేరినట్టు వారు తెలిపారు.

ఎన్నికల విధులపై అవగాహన సదస్సు



పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

పి.గన్నవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని ఫ్లయింగ్ స్క్వాడ్లు, కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలకు ఎన్నికల విధులపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సి–విజన్ మోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు అవగాహన సదస్సు నిర్వహించారు. సి–విజన్ యాప్ నిర్వహణపై ఆయన అవగాహన కల్పించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాల విధులను వివరించారు. తహసీల్దార్లు షేక్ హుస్సేన్, లక్ష్మీ ప్రమద్వార, ఎం.మేరీకమ్మ, జె.వి మలకుమారి, ఎంపీడీఓలు సీహెచ్ త్రిశూలపాణి, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంటి పీఏసీఎస్ టర్నోవర్ రూ.4.83 కోట్లు

కొత్తపేట: మండలంలోని గంటి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) బిజినెస్ టర్నోవర్ రూ.4,83,43,000తో నడుస్తోందని సంఘం పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు తెలిపారు. గురువారం సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 29 వరకూ సంఘ ఆదాయ, వ్యయాలు, ఇతర అంశాలపై సమీక్షించి ఆమోదించారు. సంఘంలో సభ్యులకు రూ.5,68,34,000 అప్పులుగా ఇచ్చినట్టు, ప్రస్తుతం రూ.4,68,314 లాభంతో నడుస్తున్నట్టు వివరించారు. 2022–23 ఆడిట్ రిపోర్టు, 2023–24 సాలుసరి నివేదిక, 2024–25 అంచనా బడ్జెట్ ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘ పర్సన్ పోలిమాటి అంజనీకుమారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ద్వారానే జీవకోటి ఉనికి



సదస్సులో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

యానాం: ప్రపంచంలో నీటి సంరక్షణ ద్వారానే జీవకోటి ఉనికి ఆధారపడి ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు డి.త్రిమూర్తులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల ప్రాణులు జీవించేందుకు నీరే ఆధారమని, అలాంటి జలవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జాతీయంగా చూస్తే రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపుల తగాదాలు తీవ్రంగా ఉంటున్నాయని, భూగర్భ జలాలు తగ్గుతుండటమే దీనికి ప్రధాన కారణమన్నారు. నీటిని పొదుపుగా వాడటం, నీటి సంరక్షణ, అడవులు, చెట్లను కాపాడుకోవడం, తద్వారా భూతాపాన్ని తగ్గించడం వంటివి చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం బెంగళూరు నగరంలో నీటి కొరత గురించి ఉదాహరణగా వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి ప్రచారం

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం అయినవిల్లి మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రచారం చేయనున్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఆయన ఈ మేరకు వెల్లడించారు. తూర్పు సెంటిమెంట్‌గా మండలంలోని పొట్టిలంక గ్రామం నుంచి ప్రచారం ప్రారంభిస్తామన్నారు. ఈ గ్రామంతో కొండుకుదురు, ఎస్.మూలపాలెం, శానపల్లిలంక గ్రామాల్లో ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తామని చెప్పారు. పార్టీ శ్రేణులంతా కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేందుకు, అన్ని నియోజక వర్గాల్లోను పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా పనిచేయాలన్నారు.

మందిరం నిర్మాణానికి రూ.50 వేల విరాళం



శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి రావులపాలేనికి చెందిన సీహెచ్ వెంకన్నబాబు గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ నిర్వాహకుడు సుందర శ్రీనివాస దాసు ప్రభుజీకి దాత వెంకన్నబాబు అందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

రూ.8 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న తాటాకిల్లు

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెం గ్రామంలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక పెద్ద తాటాకిల్లు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో తాటాకింట్లోని రెండు పోర్షన్లలో నివాసముంటున్న ముషిణి నాగేశ్వరరావు, ముషిణి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఉన్నపళంగా బయటకు పరుగులు తీశారు. స్థానికులు అమలాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తాటాకింట్లో అద్దెకు ఉంటున్న సత్యనారాయణ దానికి ఎదురుగా సొంతిల్లు నిర్మించుకుంటున్నారు. ఇంటి పనుల కోసం తెచ్చుకున్న రూ.6 లక్షల నగదు, బంగారు అభరణాలు ప్రమాదంలో కాలిబూడిదయ్యాయని సత్యనారాయణ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇలాఉండగా ప్రమాదంలో మొత్తంగా రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కేశవస్వామికి వెండి సాలగ్రామాల గొలుసు



వెండి సాలగ్రామాల గొలుసుతో కేశవస్వామి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఉప ఆలయంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారికి ఓ అజ్ఞాత భక్తుడు గురువారం వెండి సాలగ్రామాల గొలుసును బహూకరించారు. ఈ వెండి గొలుసు అర కేజీ బరువు ఉంటుందని ఆలయ అర్చకుడు పెద్దింటి రాధాకృష్ణ సత్యగణేష్ తెలిపారు. గొలుసులో 54 సాలగ్రామాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీని విలువ మార్కెట్లో రూ.50 వేల పైనే ఉంటుందని చెప్పారు.